టేకిట్ ఈజీ!!

శ్రీనివాస ఫణికుమార్ డొక్కా

నెలకో ఎపిసోడ్ రెడీ..జీ..

ఎవరేమన్నా..ఏదేమైనా టేకిట్ ఈజీ..!

చైతన్య - స్రవంతి

మాయింట్లో పెద్దగుర్రాన్ని నేనే కాబట్టి పొద్దున్నే లేచి పళ్ళుతోవుతున్నా. వెనకాతలే మా ఆవిడొచ్చి అడిగింది, కాదు కాదు అరిచింది **" అర్జెంటుగా ఐదొందలిలా ఇవ్వండి.."** అంటూ.

" పళ్ళుతోవాకా ఇవ్వచ్చా, ఇప్పుడే కావాలా? " అడిగాను భయంగా.

" ఇప్పుడే, ఇప్పుడంటే, ఇప్పుడే కావాలి..లేకపోతే లాయరొప్పుకోడు.."

ఒక్కసారి పేస్టు ఘాటు ముక్కులోకి తన్నింది. **"లాయరేవిటే?"** అన్నాను ఖంగారుగా.

"అన్‌కాంటెస్టెడ్ డైవోర్సు - అయిదువందలు మాత్రమే . ఈ వారం సేల్ ప్రైస్, వచ్చేవారం మళ్ళీ వెయ్యిట. అందుకే.."

"ఇంతకీ విడాకులులెవరికీ?"

"మనకే, ఇంకా సిగ్గులేదూ అడగటానికి ? రాత్రి నిద్దట్లో నామీద చెయ్యేసి, ఒకటే కలవరింతలు, చైతన్యా, స్రవంతీ అంటూ. ఇంతకీ మీ కొడుకు మన పిల్లకన్నా పెద్దా? చిన్నా? "

"ఎవడా దొంగనా కొడుకు?"

"ఇంకెవడు మీ ముద్దుల చైతన్య, ఆ నంగనాచి స్రవంతికీ మీకూ పుట్టిన సంతానం.."

అప్పటికి అర్థవైంది సబ్జెక్టు. **"ఓహో, అదా?"** అన్నాను నవ్వుతూ.

" ఏ, అదికాకుండా, ఇంకోత్తుందా ? ఉంటే రేపు కలవరిద్దురుగానిలెండి.." అంది బుసలు కొడుతూ.

ఇంక లాభంలేదని, పళ్ళని కడిగినంత వరకూ ఆపుజేసి, వెనక్కితిరిగి **"చైతన్య స్రవంతి అంటే అదో శిల్పం.."** అని ఇంకా ఏదో చెప్పబోతుంటే అడ్డంకొట్టి అడిగింది **" బట్టలేసుకుంటుందా, వేసుకోదా? ".**

"వినవే పిల్లా, శిల్పం అంటే శ్టాట్యూ కాదు, అదొక రైటింగ్ టెక్నిక్ అన్నమాట. ఇంగ్లీషులో ఈ చైతన్య స్రవంతిని స్ట్రీం ఆఫ్ కాన్షియస్నెస్ అంటారట. నిన్న రాత్రి ఏదో పుస్తకంలో చదివా దీనిగురించి. మనం రాయడం మొదలెట్టాకా, మనకి వచ్చిన ఆలోచన వచ్చినట్టు పేపర్ మీదపెట్టేయడమే ఈ టెక్నిక్ లోని అందం. అర్థవైందా?"

కాసేపాగి, ఆలోచించి అంది మా ఆవిడ.. **"అంటే, గుడ్డెద్దు చేల్లో పడ్డట్టన్నమాట..".**

"అంటే.., ఆల్మోస్ట్ అల్లాగే కాకపోయినా, ఇంచుమించు పాయింట్ కేచ్ చేసావు..తెలివైన మనిషి, పదునైన బుర్ర " అన్నాను రాజేంద్రప్రసాద్‌లా కాస్త ఇబ్బందిగానే అభినందిస్తూ.

"ఏమో బాబూ , పడుక్కునేముందు ఆ దిక్కుమాలిన పుస్తకాలు చదవద్దని చెప్పానా, చక్కగా "రామస్కందం" చదువుకుని పడుకుంటే హాయిగా నిద్రపట్టి పొద్దున్నకి పువ్వులా లేవచ్చు. వినిపించుకోరూ.." అంటూ కిందకెళ్ళింది బ్రేక్ ఫాస్టు పెట్టడానికి.

నేను రెడీ అయి కిందకొచ్చి బ్రేక్ ఫాస్ట్ తింటూ అడిగాను.."**అవునుగానోసే, నువ్వూ జాబ్ చేస్తున్నావు కదా, నన్నెందుకే అయిదొందలడిగావు?"** అన్నాను నవ్వుతూ..

"ఆ...అయిందానికీ, కానిదానికీ నా డబ్బులెందుకూ వేస్టు చేయడం, అదింకో ఖర్చుకుంటుందనీ.." అంది అమాయకంగా.

"అమ్మనా పెళ్ళావోయ్.. , నువ్వుండాల్సినదానివే" అంటూ షూతొడగడం మొదలెట్టా.
అప్పుడిచ్చింది అల్టిమేటం.

"ఇదిగో ఇప్పుడే చెబుతున్నా, సాయంత్రంలోపు ఈ దిక్కుమాల్న టెక్నిక్‌లో ఓ కథ రాయకపోయారో ఆ స్రవంతిమీదొట్టే. కథ రాసుకొస్తే సాయంత్రం మీకు బిరియానీ చేస్తా.." అంది ఊరిస్తూ.

"మరి రాయకపోతేనో.." అడిగాను గోముగా.
"మిమ్మల్ని బిరియానీ చేస్తా. " అంటూ చెవిపట్టుకు లేవదీసి, సాగనంపింది కారుదాకా.

అద్గదీ సంగతి. కాబట్టి ఇప్పుడు మీరంతా సావధాన్, అయాం బాబు గారొస్తున్నారు.
చైతన్య స్రవంతీ ఒకటో సారి..చైతన్య స్రవంతీ రెండోసారి.. *(చైతన్య స్రవంతి అను నేను, మీ మీద ప్రమాణంచేసి, జరిగేదీ, జరుగుతున్న సోదీ అంతా చెబుతాను, జరగంది చెప్పను..)*

ఆఫీసుకి వేళయిపోతోందని కంగారుపడుతూ షూ తొడుగుతున్నాను. దీన్ని తగలెయ్యా, లేసు ఒకవైపు పొడవూ, ఒకవైపు పొట్టీని. ఎంతల్లా ముడేద్దావన్నా ఓ పట్టాన అందిఛావట్లేదు. ఇంక తప్పదని, మొత్తంలేసు ఊడదీసి, గుచ్చి, ముడేసా. వేళాకోళం కాపోతే, కనీసం రెండో బూటన్నా సరిగ్గా వుండేడవచ్చు కదా. ఉండదు. జాతకం !! ఏంచేస్తాం...

సరే ఆ ప్రక్రియ పూర్తిచేసి వచ్చి కారెక్కా. సాధారణంగా అందరి యిళ్ళల్లోనూ, కారు గరాజ్ లో వుంటుంది. కానీ నా కారులోనే మా గరాజ్ అంతా వుంటుంది. పేసింజర్ సీట్లో నాలుగేళ్ళక్రితం పే చెయ్యవలసిన బిల్సూ, మధ్యనున్న ట్రే లో మావిడిపండు తొక్కలూ, మంచినీళ్ళ గ్లాసు డొక్కులూ, అతుక్కుపోయిన అయిదుసెంట్లూ, కెచప్ పేకెట్లూ, క్రితం సవత్సరం ఓర్లాండోలో కొన్న ఫ్రెంచ్ ఫ్రైస్ తాలుకు అవశేషాలూ, సీటుకింద దొర్లే ఖాళీ కోక్ సీసాలూ, బ్రేక్ వేసినప్పుడల్లా ముందుకు దొర్లుకొచ్చే టెన్నీస్ బాల్సూ.

వెనక్కి తిరిగి చూసాను. అక్కడా ఏమంత గొప్పగా లేదు పరిస్థితి. కాస్త ముందుకొచ్చేసిన మా పిల్ల కారుసీటూ, దాన్లో అది మాకోసం స్కూలునించి ఇంటికి పట్టుకొచ్చే కళాఖండాలూ, శిల్పాలూ, దానివీ, మా ఆవిడవీ కలిపి ఓ పన్నెండు చెప్పుల జతలూ, వివిధ వర్ణశోభలతో అలరారే రబ్బరు బేండ్లూ, విరిగిపోయిన లేస్ పొటాటో చిప్పు ముక్కలూ, నా టెన్నీసు రాకెట్టూ, పదేళ్ళక్రితమే దివాలా తీసిన షాపులో కొన్న స్పోర్ట్స్ జాకెట్టూ. ఎందుకులెండి కడుపు చించుకుంటే కారులో పడుతుంది..

కారువెనక్కి తీసేలోపులో ఎవడో **గూట్లే** గాడు హాంక్ కొట్టి వెళిపోయాడు. **"మాకూ నిద్దరొస్తోంది బాబూ, మేమూ పడుకోవాలి ఆఫీసుకెళ్ళి, అంత తొందరైతే ఎలా?"** అని విసుక్కుని, బయల్దేరి మెయిన్‌రోడ్డెక్కా. సైడు మిర్రర్ లోంచి సూర్యుడు గారు లైటుకొట్టడం మొదలెట్టారు. కసక్కని సన్‌గ్లాసెస్ తీసి సపక్ మని మొహానికి తగిలించి మిర్రర్ లో ఓ లుక్కిచ్చుకున్నా. **అర్రే, అదేంటి, జేమ్సుబాండ్ ఎలా వచ్చాడిక్కడికి !! క్వాంటం ఆఫ్ సోలేస్‌లో డానియల్ క్రెగ్గో, డై అనదర్ డే లో పియర్స్ బ్రాస్నన్** నో తేల్చుకునేసరికి కాస్తటైం పట్టింది. చివరికి పియర్స్ బ్రాస్నన్‌కి ఫిక్సయిపోయి ఎదర కారు చూసాను. నల్ల మెర్సెడీజ్, ఎస్ క్లాసు. నో డౌట్,ఖచ్చితంగా అదినా బాండ్ గర్ల్ కారే. వెంఠనే రైట్ ఇండికేటరిచ్చేసి పక్కలైన్లో కొచ్చేసా.

వెనక్కాలనించి పేద్ద హాంక్ వినబడితే అద్దంలోంచి చూసా. ఓ సిక్టీన్ వీలర్ వాడు బండబూతులు తిడుతున్నాడు. వాడికి స్టీల్ పళ్ళున్నాయి. ఐ.నో, వీణ్ణి డెఫినెట్‌గా ఆ బట్టతల విదేశీ విలన్‌గాడే పంపించుంటాడు, అయ్ డోంట్ కేర్.. పక్కకారు కేసి చూసా. అక్కడున్నది బాండ్ గర్ల్ కాదు, **బాండ్ అమ్మమ్మ. ఫిఫ్టీ ఫైవ్ జోన్ లో ట్వెంటీ టూ** లో నడుపుతోంది కారు. వళ్ళుమండి రయ్యని ముందుకెళ్ళి సయ్యని లెఫ్ట్‌ఇండికేటరిచ్చేసి ముందుకొచ్చేసా. హహహా, ఇంక ఆ స్టీల్ పళ్ళవాడిమీద రాకెట్టు వదలడవే తరవాయి.

అంతే, నాకళ్ళు అప్రయత్నంగా రోడ్డుమూలనున్న పోలీసాడి కారుమీద పడ్డాయి. వాడిచేతిలో స్పీడ్ గన్నుంది. ఒక్కసారి నా గుండె ఆగి, కొట్టుకోడం మొదలెట్టింది స్పీడ్‌గా.

అజ్జిబాబోయ్.. కొంపతీసి దొరికిపోయానా? వార్నాయినోయ్... వంద వేస్తాడో, రెండొందలేస్తాడో.. దేవుడోయ్..
ఆ...మనం బాండ్, పులి, మనని ట్రాఫిక్ పోలీస్ పట్టుకోడవా, ఇంఫాజిబుల్, కనీసం ఒక్క బాండ్ సినిమాలో కూడా ఇలా జరగలేదు, నో నొన్నొన్నొన్నో.. అనుకుంటూ పిల్లిలా అద్దంలోంచి చూసా. వాడు మెల్లిగా లైట్లేసుకుని రోడ్డెక్కుతున్నాడు. నా ప్రైప్రాణాలు పైనే పోయాయి. ఇదేటిదీ, బాబోయ్..ఏంచెయ్యాలిపుడు?

రాకెట్ లాంచ్ చెయ్ అంటున్నాడు బాండ్ గాడు.
వారినీ రాకెట్ రాహువెత్తుకెళ్ళా, వాడోచ్చేస్తున్నాడు, ఒరేయ్ శీనిగా, నువ్వే ఏదైనా ఉపాయంచెప్పరా.

..హ,హ,హ అలారా దారికి. ఇవాళ గురువారం, బాబాగారిమీద ఓ పద్యం చదువుకో. సరే, సరే, **"సదానింబ వృక్షస్య.."** పద్యం పూర్తయ్యింది. **సాయిరాం సాయిరాం** అనుకుంటూ వెనక్కి చూసా.

పోలీస్ వాడు బాండ్ అమ్మమ్మ వెనకాలకొచ్చి లైట్లేసి, మ్యూజిక్ పెట్టి, సర్వ లాంఛనాలతోటీ ఆవిణ్ణి సైడుకి తీసుకెళ్ళాడు. హమ్మయ్య, అంటే వాడునాకోసం రాలేదన్నమాట, **హహహ, బాండా, మజాకా** అనుకుంటూ ఏక్సిలరేటర్ మీద కాలెట్టా. ఇంతలో ఇటువైపొక పోలీసాడు కనిపించాడు పొదల్లోనక్కి.. వెంఠనే ఏక్సిలరేటర్ మీంచి కాలుతీసేసి ఎప్పటిలాగే సాయిరాం సాయిరాం అనుకుంటూ ముందుకెళిపోయా.

ముందుకారు డ్రైవరు సీట్లోంచి బ్లాండ్ హెయ్‌ర్ కనిపించింది. దట్సిట్. ఇది ఖచ్చితంగా నా బ్లాండ్ గర్లే, ఐ మీన్ బాండ్ గర్లే అనుకుంటూ ఫాలోఅయిపోయా. మొదటి ట్రాఫిక్ లైటొచ్చింది. ఆవిడ రేర్ వ్యూ మిర్రర్ ఓపెన్‌చేసి, మొహం కడిగింది. నల్ల బేగ్గులోంచి మౌత్ ఫ్రెష్నర్ బైటికి లాగి, పని పూర్తిచేసి, అద్దంలో ఓమాటు ఇకిలించి, పళ్ళు తళ తళా మెరుస్తున్నాయోలేదో చూసుకుని బయల్దేరింది. రెండో ట్రాఫిక్ లైటొచ్చింది. తెల్ల బేగ్గు లోంచి సెంటుబాటిల్ తీసి వంటికీ కారు సీట్‌కీ అంతా కొట్టింది. మూడో లైటొచ్చింది. జుట్టు ముడి విప్పి చిక్కుతియ్యడం మొదలెట్టింది. నాలుగో ట్రాఫి లైటుదగ్గర జుట్టు బుద్ధుడిలా పైకి కట్టి, గోళ్ళరంగేసుకుని, ఫేస్ పెయింటింగ్ మొదలెట్టింది. అయిదోలైటు దెగ్గిర ఐ లాషెస్ దిద్దింది. పెదాలకి ఎర్రరంగు పూసింది. ఒక్క స్నానం చెయ్యడం, బట్టలు మార్చుకోవడం తప్ప మిగిలిన పనులన్నీ ఆ రేర్ వ్యూ మిర్రర్ లో చూస్తూ కానిచ్చేసి, తాపీగా ఓ సిగరెట్ తీసి వెలిగించింది. ఆడాళ్ళు రేర్ వ్యూ మిర్రర్లని ఇంతల్లా ఉపయోగించుకుంటారని తెలిస్తే, కార్ల కంపెనీవాళ్ళు కనీసం ఓ నాలుగో అయిదో రేర్ వ్యూ మిర్రర్లు తగిలించరూ ?

ఆరో ట్రాఫిక్ లైటొచ్చింది... అప్పుడు గుర్తొచ్చింది,

అయ్యబాబోయ్..మా ఆఫీస్ దాటేసి మూడు ట్రాఫిక్ లైట్లైపోయిందిరా దేవుడోయ్.. సాయిరాం..సాయిరాం..ఇవాళ మా బాసుగాడు తిట్టకుండా చూడు, సాయిరాం సాయిరాం..